ప్రజాశక్తి
మంగళవారం 16 డిసెంబర్ 2025 5 అనంతపురం

సోలార్‌కు 8 వేల ఎకరాలు..!



- ఆగని సోలార్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల మంజూరు
- మడకశిర ప్రాంతంలో 1700 మెగావాట్లు
- రాయదుర్గం ప్రాంతంలో 300 మెగావాట్లకు అనుమతులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఉమ్మడి అనంతపురం జిల్లాలో సోలార్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ఏర్పాటుకు అనుమతులు ఆగడం లేదు. తాజాగా మడకశిర, రాయదుర్గం ప్రాంతంలో రెండు వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ఏర్పాటుకు అనుమతులను రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చింది. ఈ మేరకు రెండు ప్రాజెక్టులకు కలిపి సుమారు ఎనిమిది వేల ఎకరాల వరకు భూమిని సేకరించే అవకాశముంది. ఇప్పటికే ఉమ్మడి అనంతపురం జిల్లాలో మంజూరైన సోలార్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల అనుమతుల వరకు చూస్తే మొత్తం లక్ష ఎకరాలకు చేరుతోంది. ఇంకా అదనంగా వస్తే జిల్లాలో ఏ మేరకు వ్యవసాయ భూములు విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలకు పోతాయోనన్న చర్చ నడుస్తోంది.

మడకశిరలో 1700 మెగావాట్ల సోలార్ ప్లాంట్ ఏర్పాటు

మడకశిర నియోజకవర్గం పరిధిలోని మడకశిర, గుడిబండ మండలాల పరిధిలో 1700 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతులిచ్చింది. చింతా గ్రీన్ ఎనర్జీ అనే సంస్థకు ఈ అనుమతులిచ్చింది. ఇందులో మడకశిర, గుడిబండ మండలాల్లోని పలు గ్రామాలున్నాయి. కేకాతి, చిగతుర్తి, కరికేర, హరేసముద్రం, బుల్లసముద్రం, మానేరు, మేలవోయి, ఊగేపల్లి, పాపసానిపల్లి, చంద్రకచర్ల, గౌడనహళ్లి, ఆర్.అనంతపురం గ్రామాల పరిధిలో ఈ సోలార్ ప్లాంటు ఏర్పాటు చేయనున్నారు. ఒక్క మెగావాట్‌కు సగటున నాలుగు ఎకరాల వరకు భూసేకరణ జరుగుతోంది. ఈ మేరకు ఈ గ్రామాల పరిధిలో మొత్తం 6800 ఎకరాల వరకు భూమిని చింతాగ్రీన్ ఎనర్జీ సేకరించే అవకాశముంది. ఏడాదికి రూ.31 వేల చొప్పున లీజు పద్ధతిలో ఈ భూమిని సేకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతులిచ్చి ఉంది.

రాయదుర్గం పరిధిలో 300 మెగావాట్లు

రాయదుర్గం నియోజకవర్గం పరిధిలోని కణేకల్, బొమ్మనహాళ్ మండలాల పరిధిలో 300 మెగావాట్ల విద్యుత్ ఉత్పతికి రాష్ట్ర ప్రభుత్వం అనుమతులిచ్చింది. గనేకో త్రీ ఎనర్జీ ప్రయివేటు లిమిటెడ్ సంస్థకు ఈ అనుతులిచ్చింది. ఈ సంస్థ హైబ్రీడ్ పద్ధతుల్లో అంటే సోలార్, విండ్ కలగలపి విద్యుత్ ఉత్పత్తిని చేపట్టనుంది. ఈ సంస్థ కణేకల్, బొమ్మనహాళ్ మండలాల్లో ఏర్పాటుకు అనుతులిచ్చింది. అయితే ఏ గ్రామాల్లో అన్నది నిర్ధిష్టంగా తెలుపలేదు. ఏడాదికి రూ.31వేల లీజు పద్ధతుల్లోనే ఈ సంస్థకూ అనుతులిచ్చియున్నారు. ఈ రకంగా రెండు అనుమతుల ప్రకారం చూస్తే సుమారు ఎనిమిది వేల ఎకరాల వరకు వ్యవసాయ భూమి సోలార్ పద్ధతుల్లో తీసుకునేందుకు వీలుంటుంది. ఇంత పెద్దఎత్తున భూములు సోలార్‌కు పోతున్న క్రమంలో గ్రామాల్లో పరిస్థితులు రాబోయే రోజుల్లో ఏ రకంగా ఉండనుందన్నది చర్చనీయాంశంగా మారింది. ఏడాదికి లీజు రూ.31 వేలు కాకుండా దీన్ని పెంచి ఇవ్వాలని రైతు సంఘం నాయకులు కోరుతున్నారు.

అనంతపురంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న వైసిపి శ్రేణులు

బినామీల కోసమే ప్రయివేటీకరణ

- మెడికల్ కళాశాలల పిపిపి విధానాన్ని రద్దు చేయాలి
- వైసిపి నాయకుల డిమాండ్
- అనంతలో భారీ బైక్ ర్యాలీ
- తాడేపల్లికి సంతకాల ప్రతులు

ప్రజాశక్తి -అనంతపురం

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన బినామీలకు మేలు చేసేందుకు ప్రభుత్వ మెడికల్ కళాశాలలను పిపిపి పేరుతో ప్రయివేటు పరం చేస్తున్నారని, తక్షణం ఈ నిర్ణయాన్ని రద్దు చేయాలని వైసిపి నాయకులు డిమాండ్ చేశారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా వైసిపి ఆందోళన బాట పట్టింది. సోమవారం నాడు అనంతపురంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నుంచి వైసిపి శ్రేణులు పాల్గొన్నాయి. నగరంలో బైక్ ర్యాలీ చేపట్టారు. ఆపార్టీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో నగరంలోని వైసీపీ జిల్లా కార్యాలయం నుంచి ప్రారంభమైన బైక్ ర్యాలీ ఫ్లై ఓవర్, టవర్‌క్లాక్, సప్తగిరి సర్కిల్, పాతూరు మీదుగా బుక్కరాయసముద్రం వరకు కొనసాగింది. వైసిపి అనంతపురం పార్లమెంట్ పరిశీలకులు నరేష్‌రెడ్డి, ఎమ్మెల్సీలు వై.శివరామిరెడ్డి, మంగమ్మ, జెడ్పీ ఛైర్‌పర్సన్ గిరిజమ్మ, నియోజకవర్గాల సమన్వయకర్తలు సాకే శైలజనాథ్, తలారి రంగయ్య, విశ్వేశ్వరరెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డి, మెట్టు గోవిందరెడ్డి, గుంతకల్లు సమన్వయకర్త వై.వెంకట్రామిరెడ్డి తనయ నైరుతిరెడ్డి, ప్రజాప్రతినిధులు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. రహదారి పొడవునా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్లకార్డులు ప్రదర్శిస్తూ హోరెత్తించారు. పాతూరులో మహాత్మాగాంధీ విగ్రహం వద్ద నివాళి అర్పించారు. అక్కడ నుంచి బుక్కరాయసముద్రం చేరుకుని బిఆర్.అంబేద్కర్, డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు పూలమాల వేసి నివాళి అర్పించారు. అక్కడి నుంచి అనంతపురం జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా సేకరించిన 4,55,840 సంతకాల ప్రతులు ఉంచిన ప్రత్యేక వాహనాన్ని జెండా ఊపి తాడేపల్లి పార్టీ కేంద్ర కార్యాలయానికి తరలించారు. ఈ సందర్భంగా వైసీపీ నాయకులు కూటమి ప్రభుత్వం తీరుపై మండిపడ్డారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన కోటి సంతకాల ప్రజా ఉద్యమానికి విశేష స్పందన వచ్చిందన్నారు. ప్రజల నుంచి వచ్చిన వ్యతిరేకతను చూసైనా చంద్రబాబు తన నిర్ణయాన్ని విరమించుకోవాలన్నారు. పేదలకు నాణ్యమైన వైద్య విద్య అందించాలన్న లక్ష్యంతో జిల్లాకో ప్రభుత్వ మెడికల్ కాలేజీని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేస్తే, చంద్రబాబు వాటిని ప్రయివేటు పరం చేస్తూ తన బినామీలకు కట్టబెడుతున్నాడని మండిపడ్డారు. చంద్రబాబు పీపీపీ పేరుతో తీసుకున్న ప్రయివేటీకరణ నిర్ణయాన్ని తక్షణం వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకోకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఎ,బి క్లస్టర్ విధానాన్ని విరమించాలి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

సమగ్ర శిక్షలో స్కూల్ కాంప్లెక్స్‌లను ఎ, బి కస్టర్ ప్రతిపాదిత విధానాన్ని విరమించాలని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాల నేతలు డిమాండ్ చేశారు. ఎస్ఎస్–ఎలో పని చేస్తున్న క్లస్టర్ రిజర్వడ్ మొబైల్ టీచర్స్ (సిఆర్ఎంటి) తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్ ఎదుట ఎపి సిఆర్ఎంటి యునైటెడ్ ఫోరమ్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. వీరి ధర్నాకు యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు గోవిందరాజులు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్, ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు రమణారెడ్డి, ఎపిటిఎఫ్–1938 రాష్ట్ర కౌన్సిలర్ జి.రవీంద్ర, సిఆర్ఎంటి రాష్ట్ర కార్యదర్శి అంజనరాజు, రామాంజులరెడ్డి, రమణ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డీఎస్సీ ద్వారా రోస్టర్ రిజర్వేషన్ మెరిట్, ఇంటర్వ్యూల ఆధారంగా 2011లో 4034 స్కూల్ కాంప్లెక్స్‌లో సిఆర్‌పిలుగా ఎంపికై 14 సంవత్సరాలుగా పాఠశాల విద్యా శాఖ సమగ్ర శిక్షలో సిఆర్ఎంటిలు పని చేస్తున్నారని తెలిపారు. సిఆర్ఎంటిలకు క్లస్టర్ ప్రతిపాదిత విధానం సరికాదని, వీలు కాకపోతే అందరిని విలీనం చేసి క్లస్టర్‌లోనే కొనసాగించి సిఆర్ఎంటిలలో నెలకొన్న అభద్రతా భావాన్ని తొలగించి అందరికీ ఒకే విధమైన హోదాను పనిని అప్పగించాలన్నారు. ఎంటిఎస్ అమలు చేసి డీఎస్సీలో వెయిటేజీ ఇవ్వాలన్నారు. ట్రావెలింగ్ అలవెన్స్ పునరుద్ధరించాలని, ఇతర అంశాలను పరిష్కరించాలని కోరారు. సిఆర్ఎంటిలను విద్యా శాఖలో విలీనం ఏసి రెగ్యులర్ చేయాలన్నారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కల్పించాలన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే 22వ తేదీన విజయవాడలో ధర్నా నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. అనంతరం కలెక్టరేట్ రెవెన్యూభవన్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఆర్ఎంటి యునైటెడ్ ఫోరం జిల్లా అధ్యక్షులు శంకర నారాయణ, సంధ్యారాణి, జిల్లా కార్యదర్శులు రవీంద్ర, బ్రహ్మ, వెంకటరాముడు, కోశాధికారి రాముడు, రమాదేవి, నరసింహామూర్తి తదితరులు పాల్గొన్నారు.

మిల్లెట్ మేళా పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

8,9,10న మిల్లెట్ మేళా

అనంతపురం కలెక్టరేట్ : అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాకు చెందిన ఎన్జీవోల ఫోరమ్ అనంత సుస్థిర వ్యవసాయ వేదిక ఆధ్వర్యంలో జనవరి 8,9,10వ తేదీల్లో మిల్లెట్ మేళా–2026 జరగనుంది. మిల్లెట్ మేళాకు సంబంధించిన కరపత్రాన్ని సోమవారం అనంతపురం కలెక్టరేట్ రెవెన్యూ భవనంలో కలెక్టర్ ఓ.ఆనంద్ ఆవిష్కరించారు. అనంతపురం కేంద్రంగా మూడవ ఎడిషన్ మిల్లెట్ మేళా జరగనుంది. సహజ వ్యవసాయం, ఆహార ఉత్పత్తి, మార్కెటింగ్, స్థానిక వినియోగంపై అవగాహన పెంచేలా ఈ కార్యక్రమం జరగనుంది. మిల్లెట్లు, తృణధాన్యాలు, ఇతర వ్యవసాయ ఉత్పత్తులను ప్రోత్సహించేలా ఈకార్యక్రమం నిర్వహించేందుకు కృషి చేస్తున్న ఎవిఎస్ఎస్ సభ్యులు, ఎన్జీవోలను కలెక్టర్ అభినందించారు. అసియన్ ఫ్రటెర్నా ఎకాలజీ సెంటర్ నూతన సంవత్సర 2026 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.

ఆక్రమణలు నిరూపిస్తే తొలగించడానికి సిద్ధం

మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్ రెడ్డి

ప్రజాశక్తి-తాడిపత్రి

తాడిపత్రి బైపాస్ రోడ్డు పక్కన ఉన్న ఎర్రవంక ఆక్రమణకు గురైందని కలెక్టర్‌కు మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఫిర్యాదు చేసి నేపథ్యంలో మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్ రెడ్డి సోమవారం ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్దారెడ్డి వచ్చి అక్రమంగా ఏదైనా నిర్మాణం జరిగినట్లు నిరూపిస్తే దానిని పడగొట్టడానికి తాను సిద్ధంగా ఉన్నానని తెలియజేశారు. టిటిడి కళ్యాణమండపం నుంచి ఐశ్వర్యా విల్లస్ వరకు రహదారి ఏర్పాటుకు 10 సంవత్సరాల క్రితం ఏడు మీటర్లు స్థలం ఉచితంగా పంచాయతీరాజ్‌కు ఇవ్వాలని రైతులతో మాట్లాడి ఒప్పించామన్నారు. దానికి అంగీకరించిన రైతులు పంచాయతీకి ఉచితంగా స్థలం ఇచ్చారన్నారు. రహదారి ఏర్పాటుకు పంచాయతీరాజ్ శాఖ వద్ద డబ్బులు లేకపోవడంతో ఆర్అండ్‌బి వాళ్లకు ఆ బాధ్యతను అప్పజెప్పారన్నారు. కాలువ వద్ద ఉన్న మొత్తం స్థలం రైతులకు చెందినదే అన్నారు. ఆ భూమిలో 20 మీటర్లు రోడ్డుకు వదిలి మిగిలినది ప్లాట్లు వేసుకున్నారన్నారు. యల్లనూరు రోడ్డు నుంచి ఐశ్వర్యా విల్లాస్‌కు వెళ్లే దారి మధ్యలో వైసిపి నేతలు జాన్సన్, చాంద్ బాషా ప్రభుత్వ వంకను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారన్నారు. వీటిని కూడా పెద్దారెడ్డి సర్వే చేయించి నిగ్గు తేల్చాలని కోరారు. స్థలంలో ఆక్రమణలు ఉంటే వాటిని తొలగించడానికి తామే జెసిబిలను సమకూరుస్తామన్నారు. ఆక్రమణలపై పెద్దారెడ్డి చేసిన ఆరోపణలు నిరూపించాలని కౌన్సిల్ సభ్యులు మీడియా ముఖంగా కోరినా ఆయన స్పందించ లేదన్నారు. పెద్దారెడ్డి ఆరోపణలను నిరూపించాలని కోరుతూ తమ కౌన్సిలర్లు తహశీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించి, పెద్దారెడ్డి తండ్రి రామిరెడ్డి విగ్రహానికి కూడా వినతిపత్రం సమర్పించి దీక్ష చేయాలని నిర్ణయం తీసుకున్నారన్నారు.

ఎర్రవంక ప్రాంతాన్ని పరిశీలిస్తున్న జెసి.ప్రభాకర్‌రెడ్డి

అర్జీలను పెండింగ్‌లో ఉంచొద్దు : కలెక్టర్

అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

వివిధ సమస్యలపై ప్రజలు అందించే అర్జీలను నిర్లక్ష్యం చేయకుండా వాటిని పరిశీలించి పరిష్కార మార్గం చూపాలని కలెక్టర్ ఓ.ఆనంద్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ రెవెన్యూ భవనంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, ఎఫ్ఎస్ఒ జి.రామకృష్ణారెడ్డి, డిఆర్ఒ ఎ.మలోల, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు మల్లికార్జున, ఆనంద్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మతో పాటు ఆయా శాఖల జిల్లా అధికారులతో కలిసి ప్రజల నుంచి 462 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీలకు నాణ్యతగా పరిష్కారం చూపాలన్నారు. స్వర్ణాంధ్ర కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్ వివరాల నమోదులో తప్పు డేటా ఎంట్రీ జరగకుండా చూసుకోవాలన్నారు. ఎటువంటి పరిస్థితుల్లోనూ తప్పుగా డేటా ఎంట్రీ చేయరాదని, మండలాల వారిగా అధికారులు ఈ విషయమై పరిశీలన చేయాలన్నారు.

విద్యార్థులకు విసి అభినందనలు



విద్యార్థులను అభినందిస్తున్న విసి సుదర్శనరావు

ప్రజాశక్తి-అనంతపురం

జెఎన్‌టియు అనంతపురం, ఎస్‌కెయు కళాశాలలకు చెందిన విద్యార్థులు హిమాచల్ ప్రదేశ్‌లో నిర్వహించిన పిఆర్‌డి అడ్వెంచర్ క్యాంప్‌ను విజయవంతంగా పూర్తి చేసుకుని తిరిగొచ్చారు. వీరిని జేఎన్టీయూ ఉపకులపతి ఆచార్య హెచ్.సుదర్శనరావు సోమవారం నాడు తన ఛాంబర్‌లో అభినందించారు. అడ్వెంచర్ క్యాంప్‌లో జెఎన్‌టియు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు హరిత, శేషాద్రి, కార్తికేయ, పృథ్వీ, భువన ప్రీతీ, ప్రగతి, ఎస్‌కెయు నుంచి చంద్రశేఖర్, లిఖిత్ కుమార్, అమత, సిరి పాల్గొన్నారు. వీరు వివిధ సాహస కార్యక్రమాల్లో పాల్గొని వారి నైపుణ్యాలు, ధైర్యసాహసాలను ప్రదర్శించారు. విద్యార్థుల వెంట కాంటింజెంట్ ఆఫీసర్ డా॥జి.మమత వెళ్లి క్యాంప్‌ను సమర్థవంతంగా పర్యవేక్షిస్తూ విజయవంతంగా నిర్వహించారు. వీరందరినీ వైస్ ఛాన్సలర్ అభినందించి భవిష్యత్తులో మరింత ప్రతిభ చాటాలని సూచించారు. రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య, ఒఎస్‌డి టూ విసి ఎన్.దేవన్న, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ శారద, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ జి.చిన్న పుల్లయ్య అభినందించారు.

మున్సిపాల్టీ సమగ్రాభివృద్ధికి కృషి : విప్

ట్రాక్టర్‌ను అందిస్తున్న విప్ కాలవ

ప్రజాశక్తి-రాయదుర్గం

మున్సిపాలిటీ సమగ్రాభివృద్ధికి కృషి చేస్తామని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తెలిపారు. మున్సిపాలిటీలో చెత్త తొలగింపునకు కొత్తగా మంజూరైన రెండు ట్రాక్టర్లను సోమవారం పురపాలక సంఘం కార్యాలయ ఆవరణలో కాలవ ప్రారంభించి మాట్లాడారు. మున్సిపాలిటీ ఆదాయం తక్కువగా ఉన్నందున ఆశించిన స్థాయిలో అభివృద్ధి వీలుకావటం లేదని, అదనపు నిధులు తీసుకు రావడానికి ప్రయత్నిస్తున్నానన్నారు. రూ. 50 కోట్లు ఇవ్వాలని సిఎంకు విన్నవించగా సానుకూలంగా స్పందించారని తెలిపారు. డ్రెయినేజీ కాలువల ఏర్పాటుకు రూ. 23 కోట్ల మంజూరుకు మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ హామీ ఇచ్చారన్నారు. అమృత్ పథకం ద్వారా తాగునీటి సౌకర్యాలు విస్తృత పరచడానికి త్వరలో రూ.78 కోట్లతో టెండర్లు ఆహ్వానిస్తామన్నారు.

ప్రజలను నొప్పించే పనులు చేయం

మున్సిపాలిటీ ఉన్నతీకరణ వల్ల పట్టణ అభివృద్ధితో పాటు మౌలిక వసతుల కల్పనకు అదనపు నిధులు పొందటానికి వీలవుతుందన్నారు. పన్నులు పెరుగుతాయని కొందరు అసత్య ప్రచారం చేస్తున్నారని వాటిని నమ్మవద్దన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొరాలు శిల్ప, కమిషనర్ దివాకర్‌రెడ్డి, కౌన్సిలర్లు ప్రశాంతి, శ్రీలక్ష్మి, శారద, శ్రీనివాసరెడ్డి, టిడిపి పట్టణ అధ్యక్షుడు బండి కృష్ణమూర్తి, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్

రాయదుర్గం రూరల్ : ప్రజల సమస్యల పరిష్కరానికే ప్రభుత్వం ప్రజా దర్బార్ నిర్వహిస్తుందని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తెలిపారు. పట్టణంలోని ఎంపిడిఒ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇప్పటివరకూ నిర్వహించిన ప్రజాదర్బార్‌లో 332 అర్జీలు అందగా 141 పరిష్కరించామని, 189 వివిధ స్థాయిల్లో ఉన్నాయన్నారు. వేపరాలలో ఉన్నత పాఠశాల భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ నాగరాజు, ఎంపిడిఒ కొండన్న, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములుకు నివాళి అర్పిస్తున్న కలెక్టర్ ఆనంద్



పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళి అర్పిస్తున్న బల్లా పల్లవి

అమరజీవి పొట్టి శ్రీరాములుకు నివాళి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అమరజీవి పొట్టి శ్రీరాములకు వర్థంతి సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఆయనకు ఘన నివాళులు అర్పించారు. కలెక్టరేట్ రెవెన్యూ భవనంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి కలెక్టర్ ఓ.ఆనంద్, జెసి శివ్ నారాయణ్ శర్మ తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అమరజీవి పొట్టి శ్రీరాములు భాషా ప్రయుక్త రాష్ట్రాలకు ఆద్యులు అని, ఆయన సేవలు చిరస్మరణీయం అని కలెక్టర్ కొనియాడారు. ఆయన ప్రాణత్యాగం ఫలితంగానే 1953 అక్టోబర్ 1న తెలుగు మాట్లాడే ప్రజల కోసం కర్నూలు రాజధానితో ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిందన్నారు.

అనంతపురం జెఎన్‌టియు పరిపాలన భవనంలో పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి ఉపకులపతి ఆచార్య హెచ్.సుదర్శన రావు, ఓఎస్‌డి టు వీసీ ఆచార్య ఎన్.దేవన్న, యూనివర్సిటీ ఉన్నతాధికారులు, సిబ్బంది పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

అనంతపురం మార్కెట్ యార్డ్ ఛైర్‌పర్సన్ బల్లా పల్లవి ఆధ్వర్యంలో నగరంలోని టవర్ క్లాక్ వద్ద ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధులు సరిపూటి రమణ, నారాయణస్వామి యాదవ్, రజక కార్పొరేషన్ డైరెక్టర్ పరమేష్, నాయకులు రఘు, కేశవనాయుడు, శ్రీధర్, నాయుడమ్మ, చంద్రమౌళి, మణికంఠ బాబు, రజాక్, పూలబాషా, గోవింద్, శివ, నాగార్జున, హనుమాన్, శీను, ఖలందర్ పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగికి సన్మానం

ప్రజాశక్తి-శెట్టూరు

ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకుడు, కళ్యాణదుర్గం డిపోలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న మద్రిస్వామికి ఉద్యోగోన్నతి లభించింది. దీంతో ఆయన విజయవాడలోని హెడ్‌క్వార్టర్ ఎన్‌ఫోర్స్‌మెంట్ స్క్వాడ్‌లో పని చేసేందుకు వెళ్తుండగా సోమవారం డిపో మేనేజర్, తోటి ఉద్యోగులు, పట్టణ ప్రజలు ఘనంగా సన్మానించారు. ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఓబుళరాజు, వెంకటరమణ, లింగాప్రసాద్, ఎల్ఐసి మురళి, హనుమంతరెడ్డి, మల్లికార్జున స్వామి, రఘు, సత్తి, తిప్పేస్వామి, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ఇంటింటి సర్వేపై అవగాహన

ప్రజాశక్తి-పుట్లూరు

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సోమవారం ఎంపిడిఒ అలివేలమ్మ అధ్యక్షతన ఇంటింటి సర్వేపై సచివాలయ సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కుటుంబ సభ్యుల వివరాలు, ఎంతమంది చదువుకున్నారు, పిల్లలు ఏం చదువుతున్నారు, కుటుంబ పెద్దలు ఎవరైనా చనిపోయి ఉంటే వివరాలు సేకరించాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ బాబా ఫక్రుద్దీన్, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

డ్యాన్స్ పోటీలకు స్పందన

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

రాష్ట్రస్థాయి డ్యాన్స్ స్పోర్ట్స్ పోటీలు అనంతపురం ఆర్‌డిటి స్టేడియంలో ఈ నెల 14వ తేదీన నిర్వహించినట్లు రాష్ట్ర సెక్రెటరీ సురేందర్ రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ ధనుంజయ తెలిపారు. పోటీల్లో వివిధ జిల్లాల నుంచి 250 మంది పాల్గొని ప్రతిభ చాటారన్నారు. అనంతపురం జిల్లా మొదటి ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకోగా, రెండవ స్థానంలో సత్యసాయి జిల్లా, మూడవ స్థానంలో కర్నూలు జిల్లా నిలిచింది. గెలుపొందిన క్రీడాకారులు జాతీయస్థాయి పోటీలకు వెళ్లనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



సర్టిఫికెట్లు అందుకున్న డ్యాన్సర్లు

జెఎన్‌టియు అధ్యాపకులకు ఉద్యోగోన్నతులు

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జెఎన్‌టియు పరిధిలో మూడేళ్లుగా ఎదురు చూస్తున్న బోధన సిబ్బందికి ఎట్టకేలకు ఉద్యోగోన్నతులు లభించాయి. కెరియర్ అడ్వాన్స్‌మెంట్ స్కీం(సిఎఎస్) ద్వారా ఉద్యోగోన్నతులకు పాలక మండలిలో ఆమోదం తెలపడంతో ప్రక్రియ ప్రారంభం అయ్యింది. వైస్ ఛాన్సలర్ హెచ్.సుదర్శన రావు ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ ఆచార్య ఎస్.కృష్ణయ్య సోమవారం నాడు ఉద్యోగోన్నతుల ఉత్తర్వులు జారీచేశారు. ప్రొఫెసర్ నుంచి సీనియర్ ఆచార్యులుగా ఉద్యోగోన్నతి పొందిన వారిలో సివిల్ ఇంజినీరింగ్ విభాగం నుంచి ఆచార్య హెచ్.సుదర్శన రావు, ఆచార్య పిఆర్.భానుమూర్తి, ఆచార్య ఎస్.కృష్ణయ్య, ఆచార్య సి.శశిధర్, సివిల్ విభాగం ఆచార్య వైశాలి జి.ఘోర్పడే ఉన్నారు. ఈఈఈ విభాగం నుంచి ఆచార్య ఎం.విజయ కుమార్, ఆచార్య పి.సుజత, ఆచార్య ఎన్.విశాలి, ఆచార్య ఆర్.కిరణ్మయి ఉన్నారు. మెకానికల్ విభాగం నుంచి ఆచార్య కె.హేమ చంద్రా రెడ్డి, ఆచార్య జి.రంగజనార్ధన్, ఆచార్య వి.వేణు గోపాల్ రెడ్డి, ఆచార్య జి.ప్రశాంతి, ఆచార్య ఎంఎల్ఎస్.దేవకుమార్, ఆచార్య బి.దుర్గా ప్రసాద్ ఉన్నారు. ఈసీఈ విభాగం నుంచి ఆచార్య పి.రమణారెడ్డి, ఆచార్య వి.సుమలత సీనియర్ ఆచార్యులుగా ఉద్యోగోన్నతి పొందారు. సిఎస్ఇ విభాగం నుంచి ఆచార్య ఎ.ఆనందరావు, ఆచార్య బి.ఈశ్వర్ రెడ్డి, ఆచార్య పి.చెన్నారెడ్డి, ఆచార్య ఎస్.వసుంధర ఉన్నారు. కెమికల్ ఇంజినీరింగ్ విభాగం విభాగం నుంచి ఆచార్య ఎస్‌వి.సత్యనారాయణ ఉన్నారు. గణితం నుంచి ఆచార్య ఈ. కేశవ రెడ్డి, ఆచార్య జి.శంకర్ శేఖర్, కెమిస్ట్రీ విభాగం నుంచి ఆచార్య కెబి.చంద్ర శేఖర్, ఆచార్య ఎన్. దేవన్న, ఆచార్య జివి.సుబ్బా రెడ్డి, ఫిజిక్స్ విభాగం నుంచి ఆచార్య ఆర్.పద్మ, సువర్ణ ఉన్నారు. అసోసియేట్ ప్రొఫిసర్స్ నుంచి ప్రొఫెసర్లు డాక్టర్ బి.అజిత, డాక్టర్ ఎ.దామోదర్ రెడ్డి, డాక్టర్ ఎస్.తాజ్ మహబూబ్, డాక్టర్ ఎస్.అరుణ మస్తాని, డాక్టర్ కెఎఫ్.భారతి, డాక్టర్ ఎస్.శారద ఉద్యోగోన్నతి పొందారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ల నుంచి అసోసియేట్ ప్రొఫెసర్లుగా డాక్టర్ ఎస్.శ్రీధర్, డాక్టర్ ఎం.రామ శేఖర్ రెడ్డి, డాక్టర్ జె.శ్రీనివాసులు, డాక్టర్ ఎం.అంకారావు, ప్రకాష్, డాక్టర్ డిఆర్.శ్రీనివాసన్, డాక్టర్ వై.రామేశ్వర్ రెడ్డి, డాక్టర్ డి.లలిత కుమారి, డాక్టర్ జి.మురళి, డాక్టర్ ఎస్.జనిక సరిత, డాక్టర్ డి.జరీనా ఉద్యోగోన్నతి పొందారు.

సిఐటియు మహాసభను జయప్రదం చేద్దాం

విశాఖపట్నంలో ఈనెల 31, జనవరి1,2,3, 4వ తేదీల్లో జరిగే సిఐటియు జాతీయ మహాసభలను విజయవంతం చేసేందుకు కార్మిక వర్గం కృషి చేద్దామని ఆసంఘం నాయకులు పిలుపునిచ్చారు. సిఐటియు జాతీయ మహాసభలను పరస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లోనూ ఆ సంఘం జెండాలను ఎగురవేశారు. మహాసభలను జయప్రదం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. మహాసభల సందర్భంగా జనవరి 4వ తేదీన జరిగే ప్రదర్శన, బహిరంగ సభలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కూడేరు, రాప్తాడులో సిఐటియు జెండాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-రాప్తాడు

విశాఖపట్నంలో ఈ నెల 31 నుంచి జనవరి 4వ తేదీ వరకూ జరిగే సిఐటియు 18వ అఖిల భారత మహాసభలను జయప్రదం చేద్దామని కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి బాలరంగయ్య, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు మనీల రామాంజనేయులు పిలుపునిచ్చారు. రాప్తాడులో సిఐటియు నాయకులు మధు అధ్యక్షతన సీనియర్ హమాలీ కార్మికుడు సుబ్బారావు సిఐటియు జెండాను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కార్మిక వర్గాన్ని ఐక్యపరచడం సిఐటియు ఆశయమన్నారు. కార్మిక, కర్షక ఐక్యతతో పెట్టుబడిదారీ విధానాన్ని కూల్చి కార్మిక రాజ్యాన్ని స్థాపించడం సిఐటియు లక్ష్యం అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తి ప్రజావ్యతిరేక పాలన చేస్తున్నాయన్నారు. బిజెపి హిందూ మతోన్మాదాన్ని రెచ్చగొట్టి ప్రజల్లో చీలిక తెచ్చి పాలన సాగిస్తుందన్నారను. రాజ్యాంగాన్ని ధ్వంసం చేస్తుందన్నారను. కార్మిక చట్టాలను మార్పు చేసి 4 లేబర్ కోడ్‌లు తెచ్చిందని వీటిని వ్యతిరేకించాలన్నారు. కార్యక్రమంలో హమాలీలు సుబ్బారావు, లక్ష్మన్న, మధు, మల్లేష్, నారాయణస్వామి, కుమార్, హమాలీ కార్మికులు, తదితరులు పాల్గొన్నారు

కూడేరు : సిఐటియు జాతీయ మహాసభలను జయప్రదం చేద్దామని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కృష్ణమూర్తి పిలుపునిచ్చారు. స్థానిక సిఐటియు కార్యాలయం ముందు ఆయన సిఐటియు నాయకులతో కలిసి సిఐటియు జెండాను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ లేబర్ కోడ్స్ రద్దు, సమాన పనికి సమాన వేతనం, కనీస వేతనం రూ. 26 వేలు, పంచాయతీ కార్మికులకు పిఎఫ్, ఈఎస్ఐ, అన్ని పంటలకు గిట్టుబాటు ధర, రైతు నల్ల చట్టాల రద్దు, స్మార్ట్ మీటర్ల ఉపసంహరణ, వ్యవసాయ కార్మికులకు ఉపాధి హామీ చట్టం ద్వారా 200 రోజుల పని, రోజు వేతనం రూ. 600, తదితర డిమాండ్లను నెరవేర్చాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యకాసం నాయకులు కరీమ్, మల్లికార్జున, రైతు సంఘం నాయకులు వీరప్ప, సిఐటియు మండల నాయకులు చిన్నా, శివ, తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మసముద్రం : సిఐటియు జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకులు పిలుపునిచ్చారు. వారు ముందుగా స్థానిక వెలుగు కార్యాలయం వద్ద మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. అలాగే సిఐటియు జెండాలు చేతబూని మానవహారంగా ఏర్పడిని నాదాలు చేశారు. వారికి శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం యూనియన్ జిల్లా కోశాధికారి వన్నూరుస్వామి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్, మండల యూనియన్ అధ్యక్షురాలు తిప్పేరమ్మ, సెక్టార్ లీడర్లు సత్తెమ్మ, సుజాత, అనిత, త్రివేణి, సంతోషమ్మ, రెండు సెక్టార్ల పరిధిలోని అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

పామిడిలో త్రో బాల్ పోటీలో పాల్గొన్న ఉపాధ్యాయినులు

ప్రజాశక్తి-బెళుగుప్ప

క్రీడలు ఒత్తిడి తగ్గించి మానసిక ఉల్లాసం కలిగిస్తాయని ఎంపిపి పెద్దన్న, టిడిపి జిల్లా కార్యదర్శి మల్లికార్జున తెలిపారు. కళ్యాణదుర్గం డివిజన్‌లోని ఉపాధ్యాయులకు మండలంలోని ఎర్రగుడి గ్రామ హైస్కూల్ క్రీడా మైదానంలో సోమవారం క్రికెట్ పోటీలు నిర్వహించారు. ముందుగా వారు హెచ్ఎం శంకరన్నతో కలిసి క్రీడాకారులను పరిచయం చేసుకొని, పోటీలను ప్రారంభించారు. మొదటి సెమీఫైనల్ మ్యాచ్‌లో రాయదుర్గం, కణేకల్లు జట్లు పోటీ పడగా కణేకల్లు విజయం సాధించింది. రెండో సెమీఫైనల్స్‌లో బ్రహ్మసముద్రం, కుందుర్పి జట్లు తలపడగా బ్రహ్మసముద్రం జట్టు గెలిచింది. క్రీడాకారులకు సన్‌రైజ్ స్కూల్ కరస్పాండెంట్ ఈ.మారెన్న స్నాక్స్ అందజేశారు. అలాగే స్థానిక కెజిబివిలో నిర్వహించిన త్రోబాల్ పోటీల్లో భాగంగా ఫైనల్ మ్యాచ్‌లో డి.హీరేహాల్, బ్రహ్మసముద్రం జట్టు తలపడగా డి.హీరేహాల్ జట్టు విజయం సాధించి జిల్లాస్థాయి పోటీలకు అర్హత సాధించింది. పోటీలను పిడిలు మురళి, భోగేశ్, పిఇటి అనిత పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఎస్ఒ నాగరత్నబాయ్, గోపాల్‌రెడ్డి, సత్యనారాయణ, పిడి సుగుణమ్మ, కోటప్ప, గంగాధర్, సిద్దన్న, తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా త్రోబాల్ పోటీలు

పామిడి : పట్టణంలోని టిసిజిహెచ్ఎస్ పాఠశాల ప్రాంగణంలో సోమవారం గుంతకల్లు డివిజన్ స్థాయి మహిళా ఉపాధ్యాయుల త్రోబాల్ పోటీలు నిర్వహించారు. హెచ్ఎం కె.రామ్‌కుమార్ పోటీల నిర్వహణ కు ఏర్పాట్లు చేశారు. ఎంఇఒ జి.సత్యనారాయణ ముఖ్యఅతిథిగా హాజరైన పోటీలను ప్రారంభించారు. ఫైనల్ మ్యాచ్‌లో విడపనకల్లు, వజ్రకరూరు జట్లు తలపడగా విడపనకల్లు విజయం సాధించింది. క్రీడాకారులకు స్థానిక ప్రయివేట్ పాఠశాలల యాజమాన్యం సహకారంతో పామిడి చైతన్య పాఠశాల కరస్పాండెంట్ రమణారెడ్డి భోజన సదుపాయం కల్పించారు. ట్రోఫీలు, మెడల్స్‌ను కృష్ణవేణి పాఠశాల కరస్పాండెంట్ అనూరాధ స్పాన్సర్ చేశారు. కార్యక్రమంలో పిడిలు ఎల్.నాగరాజు, కె.రామకృష్ణ, ఎన్.నవీన్, తదితరులు పర్యవేక్షించారు.

వైసిపి నేత మహేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో బైక్ ర్యాలీగా బయల్దేరిన వైసిపి శ్రేణులు

వైద్య కళాశాలల ప్రయివేటీకరణను వ్యతిరేకిద్దాం

ప్రజాశక్తి-పుట్లూరు

వైద్య కళాశాలల ప్రయివేటీకరణను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని వైసిపి మండల కన్వీనర్ పొన్నపాటి మహేశ్వర్‌రెడ్డి కోరారు. స్వార్థ ప్రయోజనాల కోసం సిఎం చంద్రబాబు వైద్య కళాశాలలను కార్పొరేట్ శక్తులకు అప్పజెప్పడం దుర్మార్గమన్నారు. పిపిపి పేరుతో కూటమి ప్రభుత్వం పేదలకు వైద్యం, వైద్య విద్యను దూరం చేసేందుకు కుట్ర పన్నిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ వైసిపి ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ చేపట్టామన్నారు. అనంతరం వైసిపి ఆధ్వర్యంలో సోమవారం అనంతపురంలో చేపట్టిన బైక్ ర్యాలీలో పాల్గొనేందుకు పుట్లూరు నుంచి పొన్నపాటి మహేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు బైక్ ర్యాలీగా తరలి వెళ్లారు.

గ్రంథాలయ ఛైర్మన్ వెంకట్‌ను సన్మానిస్తున్న ఒసిసిఐ సంఘం నాయకులు

గ్రంథాలయ ఛైర్మన్‌కు సన్మానం

ప్రజాశక్తి-గుత్తి

ఉమ్మడి అనంతపురం జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ వడ్డే వెంకట్‌ను పట్టణానికి చెందిన సూర్యవంశం ఒడియరాజుల సంఘం ఆధ్వర్యంలో నాయకులు ఘనంగా సన్మానించారు. వారు సోమవారం అనంతపురంలోని ఆయన నివాసానికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఒసిసిఐ సంఘం అధ్యక్షులు పీట్ల చిరంజీవి, ఉపాధ్యక్షులు తిరుపతయ్య, రాష్ట్ర అధ్యక్షురాలు డి.లక్ష్మీదేవమ్మ, కార్యనిర్వాహక కార్యదర్శి బత్తల మారుతిప్రసాద్, నాయకులు వరదరాజులు, నాగరాజు, రాజు, తదితరులు పాల్గొన్నారు.

గంటల వ్యవధిలో దంపతుల మృతి

ప్రజాశక్తి-రాయదుర్గం

మండలంలోని పల్లేపల్లి గ్రామానికి చెందిన వృద్ధ దంపతులు గంటల వ్యవధిలో తనువు చాలించారు. కోనసాగరం తిప్పన్న(75) సోమవారం తెల్లవారుజామున అనారోగ్యంతో ఇంట్లోనే మృతి చెందాడు. భర్త మృతిని జీర్ణించుకోలేక మనోవేదకు గురైన అతడి భార్య తిప్పక్క(70) 11 గంటల సమయంలో మృతి చెందింది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. గంటల వ్యవధిలో దంపతులిద్దరూ మృతి చెందడంతో గ్రామంలో విషాదం నెలకొంది.

వ్యాయామంతో ఒత్తిడి దూరం

ప్రజాశక్తి-పెద్దపప్పూరు

ప్రతిరోజూ క్రమం తప్పకుండా వ్యాయాయం చేయడం వల్ల మానసిక ఒత్తిడి నుంచి బయటపడవచ్చని వైద్యులు మహేష్ వెంకటరమణ తెలిపారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా తహశీల్దార్ బాలాజీరాజు, డిప్యూటీ తహశీల్దార్ శ్వేత హాజరై మాట్లాడారు. ప్రతిరోజూ రెవెన్యూ సిబ్బంది చాలా మందితో మాట్లాడుతూ ఉంటారని, ఈ క్రమంలో చాలా ఒత్తిడితో సతమతమవుతుంటారన్నారు. అలాంటప్పుడు ప్రతి ఒక్కరూ వ్యాయామం చేస్తే ఒత్తిడి గురికాకుండా ఉంటారన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ ఉదయ్‌కుమార్, వీఆర్వోలు, విఆర్ఎలు, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

హైస్కూల్‌గా ఉన్నతీకరించాలని వినతి

ప్రజాశక్తి-బెళుగుప్ప

మండలంలోని విరుపాపల్లి గ్రామంలో ఉన్న ఎంపియుపి పాఠశాలను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలగా ఉన్నతీకరించాలని కోరుతూ సోమవారం స్థల దాత టిసి.రాజగోపాల్‌చౌదరి, ఎస్ఎంసి ఛైర్మన్ వి.రాజ్‌కుమార్, తదితరులు గ్రీవెన్స్‌లో ఎంపిడిఒ లక్ష్మీనారాయణ, డిప్యూటీ తహశీల్దార్ మధుసూదన్‌రావుకు వినతి పత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ ప్రస్తుతం గ్రామంలోని ఎంపియుపి పాఠశాలలో 1 నుంచి 8వ తరగతి వరకు తరగతులు నిర్వహిస్తున్నారన్నారు. దీంతో ఆ తర్వాత చదువులకు విద్యార్థులు కళ్యాణదుర్గం వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పాఠశాలకు ఎకరా స్థలం ఇవ్వడానికి దాత టిసి.రాజగోపాల్‌చౌదరి ముందుకొచ్చారని, జడ్పీ హైస్కూల్‌గా ఉన్నతీకరించి 9, 10 తరగతులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వారి వెంట హెచ్ఎం పి.మహబూబ్‌ఖాన్, వి.సంజీవరెడ్డి, ఉపాధ్యాయులు ఎస్.మహమ్మద్‌అలీ, గ్రామస్తులు ఉన్నారు.

ఎమ్మెల్యే సునీతకు పూలబొకే ఇస్తున్న థియేటర్ ఇన్‌ఛార్జి ప్రసాద్‌బాబు

'అఖండ-2'ను వీక్షించిన పరిటాల కుటుంబం

ప్రజాశక్తి-అనంతపురం

అఖండ-2 చిత్రంలో ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ నటన చాలా అద్భుతంగా ఉందని, ఇది సినీ చరిత్రలోనే ఓ మైలురాయిగా నిలిచిపోతుందని ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ తెలిపారు. వారు సోమవారం సాయంత్రం కుటుంబ సభ్యులతో కలిసి నగరంలోని శాంతి థియేటర్‌లో అఖండ-2 చిత్రాన్ని వీక్షించారు. ఎమ్మెల్యే సునీత, శ్రీరామ్ మాట్లాడుతూ దర్శకుడు బోయపాటి శ్రీను బాలయ్య అభిమానుల అంచనాలకు మించి ఈ సినిమాను తీశారన్నారు.

వికలాంగులు అన్ని రంగాల్లో రాణించాలి

ప్రజాశక్తి-విడపనకల్లు

వికలాంగులు అన్ని రంగాల్లో రాణించి, యువతకు ఆదర్శంగా నిలవాలని వైసిపి సీనియర్ నాయకులు కరణం భీమిరెడ్డి సూచించారు. మయూరి వికలాంగుల సంఘం ఆధ్వర్యంలో విడపనకల్లు లో సోమవారం వికలాంగుల దినోత్సవం నిర్వహించారు. భీమిరెడ్డి మాట్లాడుతూ వైసిపి హయాంలో మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి చొరవతో ఎంపిపి కరణం పుష్పావతి భీమిరెడ్డి సహకారంతో వికలాం గుల భవనానికి 5 సెంట్ల స్థలం కేటాయించడంతో పాటు భవన నిర్మాణానికి ఆర్థిక సాయం చేసినట్లు గుర్తు చేశారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు చెన్నరాయుడు, గడేకల్లు సర్పంచి ఉమాశంకర్, యూత్ విభాగం అధ్యక్షుడు అశోక్‌కుమార్‌రెడ్డి, వికలాంగుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ సురేష్

చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి-గుత్తి

పట్టణంలోని కెజిబివి, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, మండలంలోని కరిడికొండ ప్రభుత్వ పాఠశాలల్లో సోమవారం ఎస్ఐ కె.సురేష్, పోలీసు సిబ్బంది, శక్తి టీంతో కలిసి విద్యార్థులకు పోక్సో, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీతో పాటు పలు చట్టాలపై అవగాహన కల్పించారు. అలాగే అమృత్ సినిమా థియేటర్ వెనుక ఉన్న దళితవాడలో మహిళలకు చట్టాలపై అవగాహన కల్పించారు. 100 డయల్ ప్రాముఖ్యత, సైబర్ నేరాల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఎస్ఐ సూచించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ ప్రకాశం, తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' పనులు కల్పించాలని వినతి

అధికారులకు వినతిపత్రం ఇస్తున్న వ్యకాసం నాయకులు

ప్రజాశక్తి-శింగనమల

గ్రామాల్లో ఉపాధి పనులు కల్పించి వలసలను అరికట్టాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం వ్యకాసం మండల శాఖ ఆధ్వర్యంలో తహశీల్దార్ శేషారెడ్డి, ఎపిఒ భాగ్యలక్ష్మికి వినతి పత్రాలు ఇచ్చారు. భాస్కర్ మాట్లాడుతూ ఏడాదిలో 200 రోజులు పని కల్పించి రోజుకు రూ. 600 వేతనం ఇవ్వాలని, బకాయి వేతనాలు చెల్లించాలని, రెండు పూటల పని విధానం రద్దు చేయాలన్నారు. హార్టికల్చర్ పథకం కింద పండ్ల తోటలు పెంచుతున్న రైతులకు, పశువుల షెడ్లు కట్టుకునే రైతులకు వెంటనే బిల్లులు ఇవ్వాలన్నారు. కొత్తగా పశువుల షెడ్లు మంజూరు చేయాలన్నారు. రాచేపల్లి వద్ద చెప్పులు, తోళ్ల పరిశ్రమను పునఃప్రారంభించి ఉద్యోగావకాశాలు కల్పించాలని, కొత్తవారికి శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు చూపాలన్నారు. తరిమెల పిహెచ్‌సిలో వైద్యులు, సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండేలే చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం వరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి గిట్టుబాటు ధర కల్పించాల న్నారు. శింగనమల చెరువు ఆయకట్టు కింద పంట అయ్యే వరకూ నీరివ్వాలన్నారు. రైతులకు జిప్సం, జింక్, తదితర మందులు, ఎరువులు వంద శాతం ఉచితంగా ఇవ్వాలన్నారు. పిఎం కిసాన్, అన్నదాత సుఖీభవ అందని రైతులకు వెంటనే జమ చేయాలన్నారు. కార్యక్రమంలో ఎర్రిస్వామి, సుంకన్న, రామాంజనేయులు, సూర్యప్రకాష్, లక్ష్మీపతి, వెంకటాచలం, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమ్మె వాయిదా

మున్సిపల్ ఛైర్‌పర్సన్‌తో చర్చిస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారానికి నూతన ఛైర్‌పర్సన్ తలారి గౌతమి గడువు కోరడం తో సమ్మెను వాయిదా వేస్తున్నట్లు సిఐటియు జిల్లా అధ్యక్షుడు ఎటిఎం నాగరాజు తెలిపారు. సిఐటియు పిలుపుమేరకు సోమవారం మెరుపుసమ్మె కోసం 12 రోజుల క్రితం పిలుపు నిచ్చారు. మున్సిపాలిటీలో చోటుచేసుకున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో నూతన ఛైర్ పర్సన్ 20 రోజుల్లో సమస్యలు పరిష్కారిస్తానని కార్మికులకు హామీ ఇచ్చిన్నట్లు తెలిపారు. సిఐటియు జిల్లా అధ్యక్షుడు, స్థానిక కార్మికులు మున్సిపల్ ఛైర్‌పర్సన్, కమిషనర్‌తో సమావేశమై సమస్యలపై చర్చించారు. పనిముట్లు, వేతనాల చెల్లింపు, కార్మికుల సంఖ్య పెంపు, తదితర అంశాలపై ఛైర్‌పర్సన్ కొంత గడువు కోరడంతో కార్మికులు సమ్మతించారు.

డా॥జమ్రుద్దీన్‌కు శ్రీసమ్మాన్ అవార్డు

అవార్డు అందుకుంటున్న డాక్టర్ జమ్రుద్దీన్

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం నగరానికి చెందిన ప్రముఖ హోమియో వైద్యులు డాక్టర్ జమ్రుద్దీన్‌కు హ్యూమన్ రైట్స్ అండ్ సోషల్ జస్టిస్ సంస్థ జాతీయ స్థాయి అవార్డు ప్రదానం చేసింది. మానవ హక్కులు, సామాజిక, న్యాయరంగాల్లో విశేష సేవలందిస్తున్న హెచ్ఆర్ఎస్‌జె సంస్థ ఆధ్వర్యంలో ఇటీవల ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో డా. జమ్రుద్దీన్ మాజీ మంత్రి జీవేష్ కుమార్ నుంచి రాష్ట్రీయ చికిత్స సేవ శ్రీ సమ్మాన్-2025 అవార్డు అందుకున్నారు. హోమి యోపతి క్లినిక్ డైరెక్టర్‌గా డా. జమ్రుద్దీన్ ఎన్నో ఏళ్లుగా రోగులకు నిబద్ధతతో సేవలందిస్తున్నారు. దీంతో ఈ గౌరవం దక్కింది. ఈ అవార్డు ద్వారా రాష్ట్ర, అనంతపురం జిల్లా హోమియో వైద్య రంగానికి జాతీయ స్థాయిలో గుర్తింపు లభించిందని పలువురు వైద్యులు, ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. డా. జమ్రుద్దీన్‌కు గొప్ప గౌరవం దక్కడం పట్ల ఆయుష్, ఇతర వైద్యులు, ప్రముఖులు హర్షం వ్యక్తం చేశారు.

ఇంటర్ వర్సిటీ టిటి పోటీల విజేత 'అనంత'

విన్నర్స్‌గా నిలిచిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్

ప్రజాశక్తి-అనంతపురం

ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు రాజమండ్రిలో డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం 27వ అంతర కళాశాలల రాష్ట్రస్థాయి క్రీడోత్సవాలు నిర్వహించారు. అందులో అనంతపురం ప్రభుత్వ వైద్య కళాశాల మెడికోలు టేబుల్ టెన్నిస్(టిటి) పోటీల్లో రాష్ట్ర స్థాయిలో విన్నర్స్‌గా నిలిచారు. విద్యార్థులు ఆగ్నేయ, ఆరుషే, సుమిత్, దీపక్, తేజ ప్రథమ బహుమతి సాధించడం కళాశాలకు గర్వకారణమని ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.విజయశ్రీ, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మల్లీశ్వరి తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థులను వారితో పాటు వైస్ ప్రిన్సిపల్స్ డాక్టర్ శంకర్, డాక్టర్ షారోన్ సోనియా, డాక్టర్ తెలుగు మధు సూదన్, డాక్టర్ శంషాద్ బేగం, ఫిజికల్ డైరెక్టర్ ఎం.నరసింహ నాయక్ అభినందించారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ కమిటీ సభ్యులు ఆచార్య డాక్టర్ ఎస్.ఉమామహేశ్వరరావు, డాక్టర్ వరదరాజులు, డాక్టర్ ఆదిరెడ్డి పరదేశినాయుడు, డాక్టర్ పునర్జీవన్ కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ సుమన గోపీచంద్, డాక్టర్ లలిత భవాని పాల్గొన్నారు.

'ఉపాధి'ని నీరుగార్చే కుట్రలను ప్రతిఘటిద్దాం

ప్రజాశక్తి-రాయదుర్గం

ఉపాధి హామీ చట్టాన్ని ఓ సాధారణ సంక్షేమ పథకంగా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కుట్రలను ప్రజలందరూ ప్రతిఘటించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి.మల్లికార్జున పిలుపు నిచ్చారు. పార్టీ నాయకులతో కలిసి సోమవారం ఆయన స్థానిక ఆర్అండ్‌బి బంగ్లాలో పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. భూస్వాములు, పెత్తందారుల ఒత్తిళ్లకు లొంగిన కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని నీరుగార్చేందుకు పథకంగా మారుస్తుందని మండిపడ్డారు. చట్ట ప్రకారం పని కల్పించని రోజులకు నిరుద్యోగ భృతి ఇవ్వాల్సి ఉందని, అయితే మోడీ ప్రభుత్వం దీనిని ఎక్కడా అమలు చేసిన దాఖలాలు లేవన్నారు. ఏడాదిలో కనీసం 200 పని దినాలు కల్పించి రోజుకు రూ. 600 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు నాగరాజు, శంకర్, మధు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ వర్సిటీ పోటీలకు 'గేట్స్' విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

ప్రజాశక్తి-గుత్తి

ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ ఫుట్‌బాల్ పోటీలకు పట్టణ శివారులోని గేట్స్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఇటీవల కుప్పం ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన ఎంపిక పోటీల్లో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యునికేషన్ ఇంజినీరింగ్ ప్రథమ సంవత్సరం విద్యార్థులు సాయిశ్రీనివాస్, ఫయాజ్ ఎంపికయ్యారు. వీరు జనవరిలో జరిగే ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ ఫుట్‌బాల్ పోటీల్లో అనంతపురం జెఎన్‌టియు జట్టు తరపున ఆడనున్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించడం అభినందనీయమని ఎండి రఘునాథ్‌రెడ్డి, డైరెక్టర్ శ్రీవాణి తెలిపారు. జాతీయస్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ చూపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ వికె.పద్మావతమ్మ, ప్రిన్సిపల్ డాక్టర్ సుధాకర్, పిడి జోయల్ విజయానంద్, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీలకు 'తేజా' విద్యార్థి

బంగారు పతకాలతో నవనీత్

ప్రజాశక్తి-అనంతపురం

ఎస్‌జిఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 13 నుంచి 15వ తేదీ వరకూ గుంటూరు జిల్లాలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కత్తిసాము(ఫెన్సింగ్) పోటీలు అండర్-19 విభాగంలో నగరంలోని తేజ జూనియర్ కళాశాలలో ఫస్ట్ ఇంటర్ చదువుతున్న పతకమూరు నవనీత్ రెండు బంగారు పతకాలు సాధించినట్లు కళాశాల డైరెక్టర్ తేజేశ్వర్‌రెడ్డి, ఛైర్‌పర్సన్ ఉమాదేవి తెలిపారు. నవనీత్ వ్యక్తిగత విభాగంలో ఒకటి, టీమ్ విభాగంలో మరో బంగారు పతకం సాధించాడు. తమ కళాశాలలో విద్యార్థులను చదువుతో పాటు క్రీడల్లో ప్రోత్సహిస్తున్నామని వారు తెలిపారు. నవనీత్ మణిపూర్‌లో జరిగే జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్స్ డాక్టర్ అనిల్‌కుమార్, నేత్రవాణి, సాయిచైతన్య, ప్రిన్సిపల్స్ పెద్దిరెడ్డి, వాహిద్ ఖాన్, చీఫ్ అడ్వైజర్లు శంకర్, ఆదర్శ పాల్గొని అభినందించారు.

ఆలయం వద్ద అన్నదానం

ప్రజాశక్తి-పుట్లూరు

స్థానిక తహశీల్దార్ కార్యాలయం సమీపంలోని శ్రీవీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం వద్ద 113వ సోమవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో దాతలు ఆర్.ఓబులేసు, మూల వెంకటసుబ్బయ్య, పామిరెడ్డి శేషారెడ్డి, వి.వెంకటస్వామి, శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

న్యాయవాది లోకానంద మృతి

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణానికి చెందిన ప్రముఖ న్యాయవాది, టిడిపి లీగల్ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి. లోకానంద అనారోగ్యంతో ఆదివారం అర్ధ రాత్రి మృతిచెందారు. ఆయన రాయదుర్గం పురపాలక సంఘం లీగల్ సెల్ సలహాదారుగా పనిచేసేవారు. గతంలో రాయదుర్గం బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా పనిచేశారు. విషయం తెలిసిన వెంటనే ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు లోకానంద మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. కాలవ మాట్లాడుతూ లోకానంద ఆఖరి వరకు సామాజిక సేవా దృక్పథంతో న్యాయవాద వృత్తిలో కొనసాగారని తెలిపారు. టిడిపి లీగల్ సెల్ కార్యదర్శిగా నాతో పాటు టిడిపి శ్రేణుల కేసుల్లో ఉచితంగా వాదించారన్నారు. లోకనంద కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందన్నారు. అలాగే పలువురు న్యాయవాదులు, ప్రముఖులు లోకానంద మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

మహిళను బెదిరించడంపై కేసు నమోదు

ప్రజాశక్తి-యల్లనూరు

మండల పరిధిలోని గడ్డంవారిపల్లి గ్రామానికి చెందిన గొడ్డుమర్రి రేణుకను అదే గ్రామానికి చెందిన కుడుముల రామాంజనేయులు, గంగరాజులు స్థల వివాదంలో దుర్భాషలాడారు. దీంతో ఆమె వారిద్దరిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామాంజనేయరెడ్డి తెలిపారు.

నాటుసారా విక్రేత అరెస్ట్

ప్రజాశక్తి-గుత్తి

యాడికి మండలంలోని గుడిపాడు గ్రామంలో నాటుసారా విక్రేతను అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సిఐ కె.ఉమాదేవి, ఎస్ఐ పల్లా గోపాల్ తెలిపారు. అందిన సమాచారం మేరకు సిఐ, ఎస్ఐ సిబ్బందితో కలిసి గుడిపాడు గ్రామంలో సోదాలు చేశారు. కంబగిరి రాముడు నాటుసారా విక్రేయిస్తుండగా అదుపులోకి తీసుకుని అతడి నుంచి 5 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు. అతడికి నాటు సారా సరఫరా చేసిన పెనుకొండ సుంకన్నపై కేసు నమోదు చేశారు. రాముడును కోర్టులో హాజరు పరచగా జడ్జి రిమాండ్‌కు ఆదేశించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్ సి.వెంకటనారాయణ పాల్గొన్నారు.

కెజిబివి అకౌంటెంట్ మృతి

ప్రజాశక్తి-శెట్టూరు

స్థానిక కెజిబివిలో అకౌంటెంట్‌గా పనిచేస్తున్న ఈ.గీతాంజలి(50) అనారోగ్యంతో సోమవారం మృతిచెందారు. ఆమె అనంతపురం నగర సమీపంలోని కురుగుంటలో నివాసం ఉండేవారు. ఆమెకు భర్త ప్రకాశ్, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆమె మృతి పట్ల కెజిబివి ఉపాధ్యాయ బృందం, సిబ్బంది, విద్యార్థులు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

IN THE COURT OF THE IST ADDL. JUNIOR CIVIL JUDGE, ANANTAPURAMU
O.S. No: 78/2025

Between:
Canara Bank.(Rep by its Authorized officer, Branch Manager, Canara Bank,Main Branch-II, Ananthapuramu) **...Plaintiff**
And
Gowri Grandhey **...Defendant**

NOTICE TO DEFENDANT

To,
Gowri Grandhey W/o G. Satyanarayana, R/at D.No:1-1-559, R.K. Nagar, Ananthapuramu.

పై నెంబరు కేసులో ప్రతివాది అయిన మీ హాజరు నిమిత్తము 12-03-2026వ తేది ఉదయం 10:30 గంటలకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వయంగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
K.RAMESH BABU,
Advocate, Anantapuramu
CELL:9398549442

IN THE COURT OF THE IST ADDL. JUNIOR CIVIL JUDGE, ANANTAPURAMU
O.S. No: 569/2024

Between:
Canara Bank. (Rep by its Authorized officer, Branch Manager, Canara Bank,Singanamala Branch, Singanamala(M),Ananthapuramu Dist) **...Plaintiff**
And
K. Venkateswara Rao and another **...Defendants**

NOTICE TO DEFENDANT NO:1

D1:K.Venkateswara Rao S/o M.Kullayappa,R/at Gaddam Nagepalli (V), Narpala (M), Ananthapuramu Dist.

పై నెంబరు కేసులో ప్రతివాది అయిన మీ హాజరు నిమిత్తము 10-03-2026వ తేది ఉదయం 10:30 గంటలకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వయంగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
K.RAMESH BABU,
Advocate, Anantapuramu
CELL:9398549442

IN THE COURT OF THE JUNIOR CIVIL JUDGE, TADIPATRI
O.S. No: 426/2024

Between:
Canara Bank.(Rep by its Authorized officer, Branch Manager, Canara Bank,Yadiki Branch, Yadiki, Ananthapuramu dist). **...Plaintiff**
And
G.Chinna Ramudu and another **...Defendants**

NOTICE TO DEFENDANT NO:1&2

D1:G.Chinna Ramudu S/o Ramaiah, Lab Assistant, Z.P.H. School, Yadiki, Anantapur Dist.
D2:B. Arogya Swamy S/o Balappa, School Assistant, Z.P.H. School,Yadiki, Anantapur Dist.

పై నెంబరు కేసులో ప్రతివాదులు అయిన మీ హాజరు నిమిత్తము 23-01-2026వ తేది ఉదయం 10:30 గంటలకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వయంగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
K.RAMESH BABU,
Advocate, Anantapuramu
CELL:9398549442

పొట్టి శ్రీరాములుకు నివాళి

ప్రజాశక్తి - కొత్తచెరువు రూరల్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ కోసం ప్రాణత్యాగం చేసిన త్యాగమూర్తి శ్రీ పొట్టి శ్రీరాములు అని ఆయన ఆశయాలు, ఆదర్శాలు ప్రతి ఒక్కరికీ మార్గదర్శకమని జిల్లా కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్ అన్నారు.సోమవారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలోని పిజిఆర్ఎస్ హాలులో నిర్వహించిన శ్రీ పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్, జాయింట్ కలెక్టర్ ఎం. మౌర్య భరద్వాజ్‌తో కలిసి శ్రీ పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులు అర్పించారు.అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, తెలుగు ప్రజల ఆత్మగౌరవం కోసం, ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం పొట్టి శ్రీరాములు చూపిన అచంచల దీక్ష, స్వార్థరహిత త్యాగం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. ఆయన జీవితం ప్రజాసేవకు అంకితమైందని, ప్రజల హక్కుల సాధన కోసం ప్రాణాలను సైతం లెక్కచేయని మహనీయుడని పేర్కొన్నారు. ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు పొట్టి శ్రీరాములు ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని ప్రజాసేవలో నిబద్ధత, నిజాయితీ, బాధ్యతతో పనిచేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రొళ్ల తహశీల్దార్ కార్యాలయంలో నివాళి అర్పిస్తున్న అధికారులు

సోమందేపల్లి : తెలుగు రాష్ట్ర సాధకుడు అమరజీ పొట్టి శ్రీరాములు వర్ధంతిని సోమవారం ఎంపీడీవో వెంకట లక్ష్మమ్మ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో ప్రేమ్ కుమార్, రాష్ట్ర సగర ఉప్పర కార్పొరేషన్ చైర్మన్ రంగేపల్లి వెంకటరమణ,రాష్ట్ర వాల్మీకి డైరెక్టర్ డి.వి.ఆంజనేయులు,టీడీపీ మండల కన్వీనర్ నడిమిపల్లి వెంకటేష్, టౌన్ కన్వీనర్ వడ్డే సూరి, మాజీ కన్వీనర్ సిద్ధలింగప్ప,ఫైవ్ మ్యాన్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నంబుల పూలకుంట : పొట్టిశ్రీరాములు ఆదర్శనీయుడని మాధవరెడ్డి పేర్కొన్నారు సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో దేవదర్శన్ రెడ్డి, ఏపీవో శ్రీధర్ రెడ్డి, ఉపాధి సిబ్బంది

బత్తలపల్లి : ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం పోరాడిన అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని సోమవారం నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నరసింహనాయుడు, ఉప ఎంపీడీవో క్రిష్టప్ప, జిఎస్ డబ్ల్యూఎస్ అధికారి రామ్మోహన్ నాయుడు, ఉపాధి హామీ అసిస్టెంట్ ప్రోగ్రాం అధికారి అశోక్, కార్యాలయ సిబ్బంది ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

గోరంట్ల : పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఆయన చిత్రపటానికి ఎంపీడీవో కమలాబాయి, ఉపాధి సిబ్బంది నివాళులర్పించారు ఈ కార్యక్రమంలో ఏపీవో శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

రొళ్ల : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం పొట్టి శ్రీరాములు వర్ధంతి నిర్వహించారు. తహశీల్దార్ షేక్షావలి రెవెన్యూ కార్యాలయ సిబ్బంది పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులు అర్పించారు.

పట్టాదారు పాసు పుస్తకాల కోసం వినతులు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గంటౌన్

స్థానిక రెవెన్యూ డివిజినల్ కార్యాలయంలో సోమవారం ఆర్డీవో వసంతబాబు ఆధ్వర్యంలో గ్రీవెన్స్ నిర్వహించారు. అందులో కుందుర్పి, గుమ్మఘట్ట, బ్రహ్మసముద్రం, బెళుగుప్ప, కళ్యాణదుర్గం మండలాల రైతులు పట్టాదారు పాసుపుస్తకాల కోసం మొరపెట్టుకున్నారు. కణేకల్లు మండలంలో పంచాయతీ సమస్య, కంబదూరు మండలంలో పింఛన్లు,

ఆర్డీవోతో మాట్లాడుతున్న రైతులు

కళ్యాణదుర్గం మండలం ఇందిరమ్మ కాలనీలో దేవాదాయ శాఖకు సంబంధించిన సమస్యలపై వినతులు అందాయి. 11 మండలాల ప్రజలు వివిధ సమస్యలపై అర్జీలు సమర్పించారు. వీటిపై ఆయా శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించిన ఆర్డీవో తక్షణమే వాటిని పరిష్కరించాలని ఆదేశాలిచ్చారు.

బార్ అసోసియేషన్ ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి-గుత్తి

పట్టణంలోని న్యాయస్థానాల ఆవరణలో సోమవారం ఆలిండియా లాయర్స్ యూనియన్(ఐలు) ఆధ్వర్యంలో న్యాయవాదులు రాష్ట్ర బార్ కౌన్సిల్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎన్నికల బరిలో నిలిచిన సత్తు అంకయ్య తరఫున వారు ప్రచారం చేపట్టారు. జూనియర్ న్యాయవాదులకు ఉపకార వేతనం రూ. 10వేలు ఇచ్చేలా, న్యాయవాదులు, మహిళా న్యాయవాదుల కోసం మౌలిక సదుపాయాల సాధన కోసం అంకయ్య పోరాడుతారన్నారు. కార్యక్రమంలో ఐలు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వీరుయాదవ్, సతీష్, న్యాయ వాదులు శ్రీనివాసులు, రమేష్, సురేంద్ర, వంశీ, తదితరులు పాల్గొన్నారు.

పల్స్ పోలియోను విజయవంతం చేద్దాం

బుక్కరాయసముద్రంలో మాట్లాడుతున్న వైద్యాధికారి తెహరున్నీసా

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

ఈ నెల 21, 22, 23 తేదీల్లో నిర్వహించే పల్స్‌పోలియో కార్యక్రమాన్ని సమిష్టి కృషితో విజయ వంతం చేద్దామని పిహెచ్‌సిల వైద్యాధికారులు సూచించారు. పల్స్ పోలియో కార్యక్రమంపై సోమ వారం పలు పిహెచ్‌సిల్లో మండల స్థాయి అధికారులతో సమావేశాలు నిర్వహించారు. స్థానిక పిహె చ్‌సి, స్త్రీ శక్తి భవనంలో పల్స్ పోలియోపై సమావేశం నిర్వహించారు. మండల వైద్యాధికారి రాజేష్ కుమార్ మాట్లాడుతూ పల్స్‌పోలియోకు రెండు రోజుల ముందు ప్రతి గ్రామంలో అవగాహన ర్యాలీలు నిర్వహించాలని, దండోరా వేయించాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో తహశీల్దార్ సుమతి, ఎంఇఒ ఓబుళపతి, ఐసిడిఎస్ సూపర్వైజర్లు కాశీంబి, రామాంజినమ్మ, ఇతర అధికారులు, వైద్య సిబ్బంది, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు, వాలంటీర్లు పాల్గొన్నారు.

బెళుగుప్ప:చిన్నారుల నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలు వేయించాలని డాక్టర్ రుషికుమార్ సూచించారు. స్థానిక ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో పల్స్‌పోలియోపై సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎంపిపి పెద్దన్న, ఎంపిడిఒ టి.లక్ష్మీనారాయణ, టిడిపి నాయకుడు మల్లికార్జున హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రియాంక, సూపర్వైజర్ వెంకటరమణ, సరోజ, ఎఎన్ఎంలు, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

డి.హీరేహాల్ : అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్ల లోపు చిన్నారులదరికీ పోలియో చుక్కలు వేయించి పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని డి.హీరేహాల్ వైద్యాధికారి డాక్టర్ శ్రావణ్‌కుమార్ కోరారు. పల్స్‌పోలియోపై స్థానిక పిహెచ్‌సిలో వైద్య ఆరోగ్య శాఖ, అంగన్వాడీ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ 3 రోజుల్లో నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. సమావేశంలో డాక్టర్ రజిని, డాక్టర్ జస్వంత్, అంగనవాడీ సూపర్వైజర్ ఉమారాణి, వైద్య సిబ్బంది, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం : పల్స్ పోలియోపై స్థానిక పిహెచ్‌సిలో వైద్యాధికారి డాక్టర్ తెహరున్నీసా ఆధ్వర్యంలో ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. 0–5 ఏళ్ల లోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించేలా వైద్య సిబ్బంది కృషి చేయాలని సూచించారు. కార్యక్రమాన్ని వంద శాతం విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో సిహెచ్ఒ మోహన్‌రావు, పిహెచ్ఎన్ సుజాత, సూపర్‌వైజర్స్ విజయలక్ష్మి, సత్యనారాయణశాస్త్రి, జానీరాజ్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ధనలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ ధనుంజయ, తదితరులు పాల్గొన్నారు.

శింగనమల : బుక్కరాయసముద్రం మండలం రోటరీపురం గ్రామం వద్ద ఉన్న ఎస్ఆర్ఐటి మెకానికల్

డి.హిరేహాల్‌లో మాట్లాడుతున్న వైద్యాధికారి శ్రావణ్‌కుమార్

ఇంజినీ రింగ్ తృతీయ సంవత్సరం విద్యార్థులు విద్యుత్ ఉత్పత్తి, సాంకేతికతపై అవగాహన పొందేందుకు క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఇందులో భాగంగా రామగిరి మండలంలో సోలార్ పవర్ ప్రాజెక్ట్, గన్సన్ గ్లోబల్ సొల్యూషన్స్, విండ్ టర్బైన్ పవర్ ప్లాంట్‌ను సందర్శించారు. సోలార్ ప్యానెల్స్, ఇన్వర్టర్ స్టేషన్లు, సోలార్ ట్రాకింగ్ సిస్టమ్స్, గ్రిడ్‌కు విద్యుత్ అనుసంధాన ప్రక్రియ, విద్యుత్ పంపిణీ, ప్లాంట్ నిర్వహణ, తదితర అంశాలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. విండ్ ఎనర్జీ ఉత్పత్తికి అవసరమైన గాలి వనరుల అంచనా, టవర్ డిజైన్, నిర్వహణ విధానాలపై విద్యార్థులకు నిపుణులు అవగాహన కల్పించారు. వారి తో పాటు కళాశాల ప్రిన్సిపల్ డా. జి.బాలకృష్ణ, మెకానికల్ విభాగాధిపతి డా. డి.సాయి చైతన్య కిశోర్, పరిశ్రమల సందర్శన సమన్వయకర్త సిహెచ్.జోసెఫ్‌సుందర్ ఉన్నారు. ఆయా సంస్థలకు కళాశాల యాజమాన్యం కృతజ్ఞతలు తెలిపింది.

చేనేత కార్మికులకు ముద్ర రుణాలు అందించాలి

ప్రజాశక్తి-సోమందేపల్లి

చేనేత కార్మికులకు నేతన్న నేస్తం తో పాటు ముద్ర రుణాలు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆసంఘం మండల కమిటీ అధ్యక్షులు మాబు ఆధ్వర్యంలో చేనేతలు సోమవారం డిప్యూటీ తహశీల్దార్‌ను కలిసి కార్మికుల వ్యక్తిగత వివరాలతో అవసరమైన పత్రాలను అందించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్ష కార్యదర్శులు మాబు జింక నాగరాజు మాట్లాడుతూ చేనేత కార్మికులు గత రెండు సంవత్సరాల నుండి నేతన్న నేస్తం పొందలేదన్నారు. కూటమి ప్రభుత్వం చెప్పిన విధంగా చేనేత కార్మికులకు ఇస్తామన్న 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు అమలుకు నోచుకోలేదన్నారు. అర్హులైన చేనేత కార్మికులకు కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న ముద్ర రుణాలు అందలేదని బ్యాంకు అధికారులు ముద్రా రుణాల పంపిణీలో పారదర్శకత పాటించకుండా రాజకీయ ఆర్థిక సామాజిక పలుకుబడి కలిగిన వాళ్లకు మాత్రమే రుణాలు ఇస్తున్నారని విమర్శించారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం మండల నాయకులు సుధాకర్ , షబ్బీర్, శ్రీనివాస్, బాబాజాన్ , ఈడిగ నాగేష్ , రియాజ్ , నరసింహులు , ఆంజనేయులు , రామాంజినప్ప , గౌరమ్మ , జయమ్మ , నాగభూషణం , ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించండి

ప్రజాశక్తి - ఓబుళదేవరచెరువు

మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన రైతుల సమస్యలను అధికారులు పరిష్కరించాలని సిపిఐ నాయకులు చలపతినాయుడు డిమాండ్ చేశారు. ఈసందర్భ:గా ఆయన మాట్లాడుతూ రైతులకు గతంలో ఇచ్చిన భూములకు డి పట్టా అని కార్డులో ఉన్నందున ప్రభుత్వ నుండి వచ్చే సీఎం కిసాన్ రైతు సుఖీభవ చాలామందికి వర్తించలేదన్నారు. ప్రభుత్వం నుండి అందాల్సిన సహాయాన్ని పెండింగులో ఉన్న రైతులందరికీ అందించి న్యాయం చేయాలన్నారు. మండలంలోని వడ్డీ వారి పల్లి నుండి ఓడిసి వరకు ఉన్న రోడ్డు గుంతల మయంగా మారిందని ఈ రోడ్డు మరమ్మతులు చేపట్టి నివారణ చేపట్టాలని కోరారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్ శ్రీనివాస్ రెడ్డికి అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవి కుమార్, రామచంద్ర, రత్న బాయ్, దేవేంద్ర, వీరప్ప, వెంకట్ రమణ,తదితరులు పాల్గొన్నారు.

చిన్న వెంకటేష్‌కు 'అంబేద్కర్' అవార్డు

ప్రజాశక్తి-గుత్తి

మాల మహానాడు నాయకుడు చిన్న వెంకటేష్‌కు డాక్టర్ అంబేద్కర్ విశిష్ట సేవారత్న అవార్డు ప్రదానం చేశారు. గుంటూరులో మాల మహాసభ, మాల మహానాడు సంయుక్త ఆధ్వర్యంలో మాలల ఆత్మీయ కలయిక నిర్వహించారు. అందులో రాష్ట్ర వ్యాప్తంగా 200 మంది నాయకులకు డాక్టర్ అంబేద్కర్ విశిష్ట సేవారత్న అవార్డులు ప్రదానం చేశారు. అందులో భాగంగా పట్టణంలోని పైమాల వీధికి చెందిన చిన్న వెంకటేష్‌ను శాలువాతో సత్కరించి అవార్డు అందజేశారు. మాల సామాజిక వర్గం ప్రజల అభివృద్ధి కోసం చేస్తున్న కృషిని గుర్తించి అవార్డును ప్రదానం చేశారని గ్రహీత చిన్న వెంకటేష్ తెలిపారు. మాలల సమస్యల పరిష్కారానికి రాజీ లేని పోరాటాలు చేస్తామన్నారు.

ఘనంగా కేంద్రీయ విద్యాలయం వార్షికోత్సవం

ప్రజాశక్తి-అనంతపురం

నగర శివారులోని కేంద్రీయ విద్యాలయ సంఘటన్(కెవిఎస్)లో సోమవారం 63వ వార్షికోత్స వాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. ఎస్కెయు భూగోళ శాస్త్రం విభాగాధ్యక్షురాలు ప్రొఫెసర్ ఎ.కృష్ణ కుమారి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. క్రమశిక్షణ, అంకితభావం, కష్టపడి పని చేయడం, సానుకూల ఆలోచన, లక్ష్యసాధన వంటి అంశాలపై దృష్టి సారిస్తే ఎందులోనైనా విజయం సాధించ వచ్చున్నారు. కెవిఎస్ విద్యా ప్రమాణాలు, సమగ్ర విద్యాభివృద్ధి, జాతీయ సమైక్యత లక్ష్యంగా పని చేస్తుందన్నారు. కెవిఎస్ ఆశయాలను కొనసాగించేందుకు పునరంకితం అవుదామని పిలుపునిచ్చారు. రిటైర్డ్ ఉపాధ్యాయులు కె.సుబ్రహ్మణ్యం, రాఘవేంద్ర ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరయ్యారు.